క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మండల పరిషత్ అధ్యక్షుడు కృష్ణానాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య కార్తీక దీపారాధన



ఆత్మకూర్: కార్తీకమాసం అమావాస్య సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక నేతాజీనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక దీపారాధనలో భాగంగా మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రత్యేక పూజల అనంతరం భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జ్యోతి, విజయలక్ష్మి, సక్కుబాయ్, కృష్ణవేణి, సుజాత, సరోజ, శాంత, శోభ, అంజమ్మ, సునీత పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాల పరిశీలన



పాన్‌గల్: పదో తరగతి విద్యార్థుల డేటా(నామినల్ రోల్) వివరాల పరిశీలన రెండో రోజు మంగళవారం కొనసాగినట్లు ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లోని ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థుల డేటా వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పబ్లిక్ పరీక్షల నిమిత్తం సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. రెండో రోజు చిన్నంబావి ఐదు పాఠశాలలు, వీపనగండ్ల ఐదు పాఠశాలలు, పాన్‌గల్ మూడు పాఠశాలల వివరాలను పరిశీలించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. మిగిలిన పాఠశాలల వివరాలను మూడో రోజు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశీలన టీం మెంబర్స్ లక్ష్మీనారాయణ, వెంకటేష్, మోహన్, చంద్రశేఖర్, గోవింద్, జగన్, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



ఆత్మకూర్: స్వామియే శరణం అయ్యప్ప అంటూ.. అయ్యప్ప నామస్మరణతో దీక్షపరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆత్మకూర్‌లోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప క్షేత్రంలో బోరింగ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆత్మకూర్‌లోని అయ్యప్ప కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతినిత్యం పూజ కార్యక్రమాలతో పాటు దీక్షపరులకు అన్నదానం(బిక్ష) కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు కూరగాయల రఘు, ఎస్టీడీ శ్రీను, జిన్నారం శ్రీను, శ్రీకాంత్, బాలు, భరత్, బాబు, నరేష్‌రెడ్డి, పాండు, శ్రవణ్, మెకానిక్ శ్రీను తదితరులు ఉన్నారు.

'సకాలంలో లోన్లు చెల్లించకుంటే నష్టం'

వీపనగండ్ల: బ్యాంకులో లోన్లు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించకుంటే నష్టపోతారని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ మేనేజర్ రవీంద్రబాబు సూచించారు. గతంలో తమ బ్యాంకు ద్వారా పంట రుణాలు తీసుకున్న 2,800 రైతులకు రుణమాఫీ జరిగిందని, పలు కారణాలతో 578 రైతులకు రుణమాఫీ జరగలేదని అన్నారు. రుణమాఫీ జాబితాలో పేర్లు వచ్చిన మరో 1,300 రైతులు తమ రుణ ఖాతాలను రెన్యూవల్ చేసుకోలేదని, దీంతో రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని సూచించారు. పైప్‌లైన్ రుణాల కోసం తమ బ్యాంక్ నుంచి రుణాలు తీసుకున్న రైతులు రూ.6 కోట్లు, ముద్ర లోన్ల ద్వారా రూ.1.42 కోట్లు, దీర్ఘకాలికంగా బకాయి పడ్డారని, అలాంటి వారికి ఉన్నత స్థాయి బ్యాంక్ అధికారుల ఆదేశానుసారం వన్‌టైం సెటిల్‌మెంట్ చేసి రుణ విముక్తులను చేస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పది'కి ప్రత్యేకం

- వంద శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ
- వెనుకబడిన విద్యార్థులపై దృష్టి
- పాఠ్యాంశాల్లోని సందేహాలు నివృత్తి
- శ్రద్ధ వహిస్తున్న ఉపాధ్యాయులు



కేతేపల్లి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

పాన్‌గల్: వంద శాతం ఫలితాలే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశానికి ఒక పేపరు ఉండటంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధత, ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నవంబర్ 6 నుంచే ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఒక పాఠ్యాంశానికి సంబంధించిన ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతుల్లో ఉండి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అదేవిధంగా వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రత్యేక తరగతులతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. డిసెంబర్ చివరి వరకు ఒక పూట మాత్రమే నిర్వహించి, జనవరి నుంచి ఉదయం, సాయంత్రం కూడా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా సందేహాలు నివృత్తి అవుతున్నాయని, చాలా ఉపయోగకరంగా నిర్వహిస్తున్నారని విద్యార్థులు తెలియజేస్తున్నారు.

మండలాల వారీగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలు..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
చిన్నంబావి	09	112
పాన్‌గల్	11	410
వీపనగండ్ల	08	138

అల్పాహారం అందించాలి..

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న పదో తరగతి విద్యార్థులు ఉదయం ఇంటి నుంచి రావడంతో ఇంట్లో భోజనం, టిఫిన్ చేసి రావడం వీలు కావడం లేదు. మధ్యాహ్నం వరకు భోజనం లేకపోవడంతో నీరసంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రత్యేక తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థులు వాపోతున్నారు.

ఎంతో ఉపయోగం..



ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాఠ్యాంశంపై ఉన్న సందేహాలు పూర్తి స్థాయిలో నివృత్తి అవుతున్నాయి. పూర్తిగా అవగాహన కలుగుతుంది. పది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. వందశాతం ఫలితాలు సాధించడానికి ఇవి దోహదం చేస్తాయి. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– తేజస్విని, 10వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల, పాన్‌గల్

సందేహాలు నివృత్తి చేస్తున్నారు..



ప్రత్యేక తరగరతులతో వందశాతం ఫలితాలు సాధిస్తాం. ఉపాధ్యాయులు రోజుకు ఒకరు చొప్పున ఉండి మా సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఉదయం పూట నిర్వహించడంతో చాలా శ్రద్ధగా చదువుకుంటున్నాం. మా పాఠశాలల్లో అత్యధికంగా పది జీపీఏలు సాధిస్తామనే నమ్మకం ఉంది.

– అఖిల, 10వ తరగతి, ఉన్నత పాఠశాల వీపనగండ్ల

ఉత్తమ ఫలితాల కోసమే..



ఉత్తమ ఫలితాల కోసం మండలంలోని ఉన్నత పాఠశాలల్లో రోజూ ఉదయం గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతుల్లో ఉంటూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలి. మంచి ఫలితాల సాధనకు కృషిచేయాలి. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధవహించాలి. అన్ని పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

ఆలయాల్లో అన్నదానం



నాగల్‌కడ్మూర్‌లో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



ఖిల్లాఘనపురం వీరభద్ర స్వామి దేవాలయంలో..

అమరచింత: అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో వెలిసిన దేవేంద్రచార్యుల మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మఠం నిర్వాహకులు, వివిధ గ్రామాల నుంచి మఠానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమరచింత పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం, శివచౌడేశ్వరి ఆలయంలో పూజలతో పాటు అన్నదానం నిర్వహించారు. చంద్రగడ్ గుట్టపై శివాలయంలో అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న దేవాలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది బాగాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెల అమావాస్య రోజున దేవాలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటుగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలుగ్రామాలకు చెందిన ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమ నిర్వహణకు సహకారం అందించారు.

అంతర్జాతీయస్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె ఉపసర్పంచ్ కురుమయ్య కుమార్తె ఆర్.పూజ అంతర్జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉత్తమ షూటర్‌గా జ్ఞాపిక అందుకుంది. హైదరాబాద్ ఇబ్రహీంపట్నం ఎంజేపీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పూజ నేపాల్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ప్రజలు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

మూతపడిన గ్రంథాలయం



మూతపడిన పాన్‌గల్ గ్రంథాలయం

పాన్‌గల్: మండల కేంద్రంలోని గ్రంథాలయం రెండు రోజులుగా తెరుచుకోక మూతపడింది. పాఠకులకు, నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడే గ్రంథాలయం రెండు రోజులుగా తెరచుకోకపోవడంతో పాఠకులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చేవారు, విద్యార్థులు సాయంత్రం తమ గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు వచ్చే వరకు గ్రంథాలయంలో కూర్చొని పత్రికలు, పుస్తకాలు చదువుకునేవారు. గ్రంథాలయం మూసి ఉండటంపై స్థానికులు, పాఠకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రంథాలయం మూతపడకుండా తగు చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు. ఈ విషయంపై లైబ్రేరియన్ ఎక్బాల్‌ను వివరణ కోరగా.. సంబంధిత అధికారులు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో విధులు కేటాయించడంతో అక్కడికి వెళ్లానని, దీంతో గ్రంథాలయాన్ని తెరవలేదన్నారు.

ఆక్రమణలకు గురవుతున్న డ్రెయినేజీలు

అమరచింత: మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులకు ఇరువైపుల నిర్మించిన డ్రెయినేజీలతో పాటు అయా వార్డుల్లోని డ్రెయినేజీలు ఆక్రమణకు గురవుతున్నా.. నివారించలేని స్థితిలో మున్సిపల్ అధికారులు తయారయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతినిత్యం డ్రెయినేజీలను శుభ్రం చేయాలని ఆయా వార్డుల్లోని డ్రెయినేజీలపై స్లాబ్‌లు ఏర్పాటు చేసుకోవడంతో మురుగు తొలగించలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇంటి నిర్మాణాల కోసం పర్మిషన్ ఇస్తున్న మున్సిపల్ అధికారులు, ఇంటి నిర్మాణ సమయాల్లో ఇచ్చిన పర్మిషన్ ప్రకారమే ఇంటి నిర్మాణాలు కొనసాగుతున్నాయా.. లేదా అనే విషయాలను తెలుసుకోలేకపోవడంతో యాథేచ్ఛగా డ్రెయినేజీలను కబ్జా చేసుకుంటూ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి డ్రెయినేజీలు ఆక్రమించుకుని నిర్మాణాలు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే...



అమరచింత: పట్టణంలోని రాణాప్రతాప్ నగర్‌లో మున్సిపాలిటీ సోర్స్‌బోరు కోసం ఏర్పాటు చేసిన స్టార్టర్ విద్యుత్ స్తంభానికి కిందకు కట్టి ఉంచడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోననే భయంతో కాలనీ ప్రజలు ఉన్నారు. స్టార్టర్‌కు త్రీఫేస్ విద్యుత్ వైర్ అమర్చి కిందకు వేలాడదీశారు. చిన్నారులు అటుగా వెళ్తే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు అమర్చిన స్టార్టర్‌ను స్తంభం పైకి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



జె.లక్ష్మి

కొత్తకోట: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ క్రీడల్లో అండర్–19 బాలికల విభాగంలో పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.లక్ష్మీ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానం సాధించినట్టు పీఈటీలు రాజేశ్వరి, భారతి తెలియజేశారు. రానున్న రోజుల్లో చెస్ పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించారు. మొదటి స్థానం సాధించిన లక్ష్మీని టీచర్స్ బృందం అభినందించారు.

ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి వేణుకుమార్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలుర అండర్–14 వాలిబాల్ జట్టుకు ఎంపికయినట్లు హెచ్‌ఎం గణేష్‌కుమార్ తెలిపారు. వేణుకుమార్ ఈ నెల 13 నుంచి 15 వరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో కొనసాగే రాష్ట్ర స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు నుంచి పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం, సర్పంచ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భానుప్రకాష్‌రావు, పీఈటీ శేఖర్, సాయిబాబ, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియాకు వనపర్తి విద్యార్థి



రుద్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గౌతమ్ కుమార్

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జి.రుద్ర ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 24, 25, 26వ తేదీల్లో కొనసాగనున్న కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పోటీ చేయనుందని, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.గౌతంకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో రుద్రను ప్రిన్సిపాల్ గౌతమ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 9, 10వ తేదీల్లో వరంగల్‌లో జరిగిన అండర్–10, 11, 12 కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించి నేరుగా ఖేలో ఇండియాలో పోటీ చేసేందుకు అర్హత సాధించాడని వివరించారు.

నేడు 'హలో ఎమ్మెల్యే'

సాక్షి ఫోన్ ఇన్



జి.మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే

దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తారు. ఈ మేరకు 'సాక్షి' బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు 'హలో ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఫోన్ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు: 98487 57419, 97017 51369

సమయం: బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు

ఉపాధిహామీ పథకంపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉపాధిహామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీపై ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి, వైస్ ఎంపీపీ శేఖర్ అధ్యక్షతన ప్రజానివేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు జరిగిన పనులపై గ్రామపంచాయతీల్లో ఇప్పటికే సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ పనులకు సంబంధించిన పూర్తి నివేదికలను మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ప్రజాప్రతినిధులు, అధికారులకు తనిఖీపై ప్రజానివేదిక చదివి వినిపించారు. ఈ క్రమంలో ఉపాధి పనులు, కూలీలపైన రూ.23,723 తేడా గర్తించినట్లు అధికారులు తెలిపారు. తేడా వచ్చిన డబ్బులను సంబంధిత సిబ్బంది కట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి డీఆర్‌డీఓ నర్సింహులు, అంబుడ్స్ పర్సన్ సత్యనారాయణ రెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ రహీం, కోఆప్షన్ మతీన్, ఎంపీడీఓ ఉసేనప్ప, ఏపీఓ నరేందర్ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె



కొత్తకోటలో సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు



గోపాల్‌పేట పోస్టాఫీస్ వద్ద నిరసన

కొత్తకోట రూరల్: ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తపాలా ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వనపర్తి డివిజన్ ఏఐజీడీఎస్‌యూ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. తపాలా ఉద్యోగుల సమ్మెలో భాగంగా మొదటి రోజు కొత్తకోట పోస్టాఫీస్ ఎదుట సమ్మెలో కూర్చున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. వెంకటేష్, రామకృష్ణ, శర్మ, రమేష్‌గౌడ్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు నివరదిక సమ్మె కొనసాగిస్తామని స్థానిక తపాలా ఉద్యోగ నాయకులు అన్నారు. జీడీఎస్, జేసీఏ కేంద్ర సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు.. మంగళవారం స్థానిక పోస్టాఫీస్ ముందు తపాలా ఉద్యోగులు నిరవదిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎనిమిది గంటల పని మరియు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.ఐదు లక్షలకు పెంచాలని, గ్రాట్యుటీ రూ.5 లక్షలకు పెంచాలన్నారు. పెయిడ్ లీవు 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలన్నారు. ఇవే కాకుండా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు నిరవదిక సమ్మెను కొనసాగిస్తామని చెప్పారు. వనపర్తి డివిజన్ సెక్రెటరీ విష్ణువర్ధన్ గౌడ్, మసూద్, శేఖర్, స్వామి, శివ, భాగ్యలక్ష్మి, సిద్దు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



సూగూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ పద్మ

పెబ్బేరు రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలని జెడ్పీటీసీ పద్మ కోరారు. మంగళవారం మండలంలోని సూగూరులో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, నరసింహ, పెద్దింటి వెంకటేష్, నాగరాజు, మహిళా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

చిన్నంబావి: మండలంలోని బెక్కెం, గూడెంలో దాదాపుగా ఆరేళ్లుగా బస్సు సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తాను గెలిచిన వెంటనే గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. దీంతో మంగళవారం గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి బస్సు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జె.శ్రీను, కురుమూర్తి, రామస్వామి, ఉమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పెబ్బేరులో ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని 5 వార్డుకు చెందిన సత్తూర్ లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు పంపించిన ఆర్థిక సాయాన్ని స్థానిక నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, స్థానిక నాయకులతో కలసి వార్డులో మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు సురేందర్‌గౌడ్, రంజిత్‌కుమార్, వెంకటేష్‌సాగర్, శివసాయి, కృష్ణయ్య, గందం అంజి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పులిజాల లక్ష్మయ్య(65) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జీఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి శవపేటిక ఖర్చు నిమిత్తం రూ.2,500 ఆర్థికసాయం అందజేశారు. జీఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జె.సతీష్‌రాజ్, సుభాష్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.